క్లుప్తంగా

భోగేశ్వరంలో భక్తజన సందడి



భోగేశ్వరుడి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచియున్న భక్తులు

గడివేముల: దుర్గాభోగేశ్వరాలయం ఆదివారం భక్త జనంతో సందడిగా మారింది. కార్తీకమాసానికి ఆదివారం తోడవడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి వారు శ్రీ దుర్గా భోగేశ్వరుడి దర్శించుకున్నారు. పలువురు స్వామికి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించి శివనామస్మరణ చేశారు. పూజల అనంతరం భక్తులు కాశీనాయన ఆశ్రమంలో అన్నదాన ప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారి సన్నిధిలో భజన



అమ్మవారిని దర్శించుకుంటున్న భజన బృందం సభ్యులు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద వెలసిన శ్రీ బాలత్రిపురసుందరి ఆలయంలో ఆదివారం భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో కర్నూల్‌కు చెందిన భజన బృందంతో పాటు చుట్టుపక్కల భజన బృందాలు పాల్గొన్నట్లు పీఠాధిపతి సోమశేఖర్ నాయక్ తెలిపారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి పంచామృత పూజలు, అభిషేకాలు అర్చనలు చేశారు.

జేవీడీ అకౌంట్ల వివరాలను సమర్పించాలి

కోడుమూరు రూరల్ : జగనన్న విద్యాదీవెన పథకానికి సంబంధించి విద్యార్థి తల్లితో కలిసి జాయింట్ బ్యాంకు అకౌంట్ ప్రారంభించి వివరాలను ఆయా గ్రామ సచివాలయాల్లో సమర్పించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన నాల్గవ విడత మంజూరు కోసం లబ్ధిదారుల జాయింట్ అకౌంట్ వివరాలను నవశకం పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. ఈ వివరాలను సచివాలయ డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ సూచించారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో సూచించారు. స్థానిక మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్ ఫిజియోథెరపీ చేస్తారన్నారు. దివ్యాంగులకు భవిత కేంద్రానికి తీసుకవచ్చి, ఫిజియోథెరపీని చేయించుకోవాలని సూచించారు.

ఘనంగా కాళీమాత నిమజ్జనోత్సవం



కాళీ మాత నిమజ్జన ఊరేగింపులో భక్తులు

కర్నూలు కల్చరల్: నరక చతుర్దశిని పురస్కరించుకొని ఓల్డ్‌సిటీ కుమ్మరి వీధిలోని రాంబొట్ల ఆలయంలో ఏర్పాటు చేసిన కాళీ మాత నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి తుంగభద్రా నది వరకు కాళీ మాతను ఊరేగించి అక్కడ నిమజ్జనం చేశారు. నిర్వాహకులు మధు, బీజేపీ నాయకులు కగ్గోలు హరీష్‌బాబు, గణేష్, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ



విగ్రహ పునఃప్రతిష్ఠలో పాల్గొన్న టీజీ వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్లలో ఆదివారం రేణుక ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ ఘనంగా జరిగింది. కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధర్మకర్త మండలి సభ్యులు టీజీని సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ ధర్మకర్త మండలి అధ్యక్షురాలు ప్రమీలమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

• భక్తి పారవశ్యం

కర్నూలు కల్చరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం గోవర్ధన గిరి పూజలు నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరినామ సంకీర్తన చేశారు. ఇస్కాన్ ప్రవచనా కారులు గోవర్ధన లీలపై ఉపన్యసించారు. అనంతరం స్వామి వారికి 108 రకాల ఆహార పదార్థాలతో మహా రాజ భోగ నివేదన చేశారు. మహా మంగళ హారతి, ప్రభుపాదుల ప్రేమ విందు నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ బాధ్యులు రఘునందన్ సేవక్ దాస్, ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పూరి జగన్నాథ మందిరంలో పూజా కార్యక్రమానికి హాజరైన భక్తులు



గోవర్ధన గిరికి రాజ భోగ నివేదన, మహా మంగళ హారతి ఇస్తున్న ఇస్కాన్ బాధ్యులు

• భక్తి శ్రద్ధలతో కలశ యాత్ర

కర్నూలు కల్చరల్: భగవాన్ పుట్టపర్తి సత్యసాయి బాబా జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. సత్యసాయి సేవా ట్రస్ట్ సభ్యులు, మహిళా భక్తులు సాయి చిత్రపటం, కలశ యాత్ర నిర్వహిలచారు. ప్రత్యేక పూజలు, ప్రార్థనలు, భజనలు జరిగాయి. సత్యసాయి జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. తరిగొండ వెంగమాంబ అధ్యక్షురాలు, ఉపాధ్యాయురాలు పసుపులేటి నీలిమ సందేశమిచ్చారు. కార్యక్రమంలో సాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్, సభ్యులు, సాయి భక్తులు పాల్గొన్నారు.



కలశ యాత్రలో మహిళలు

• దేవతల ప్రతి రూపం గోమాత

కర్నూలు కల్చరల్: ముక్కోటి దేవతల ప్రతి రూపం గోమాత అని, వాటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శ్రీ గురు దత్త ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయ ఆవరణలో శ్రీ సూర్య దత్త గో రక్షణ శాల ప్రవేశ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. గో పూజ, గణపతి పూజ, పుణ్యావాహచనం, పంచగవ్య మేళనం, ప్రధాన కలశ స్థాపన, మహాగణపతి, లక్ష్మీనారాయణ, వాస్తు, సూర్య పంచాయితన, పరివారదేవతా హోమాలు నిర్వహించారు. నగర మేయర్‌తో పాటు కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, ఆలయం ఎగ్జిక్యూటివ్ సభ్యులు శివ రామకృష్ణ, శ్రీదేవి, డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ నగేష్ వర్మ, డాక్టర్ కృష్ణ మోహన్ నాగజ్యోతి, కృష్ణమూర్తి, ప్రసాదరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మేయర్ బీవై రామయ్య, కేడీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి

జీతాలు పెంచాలని వినతి

పాణ్యం: రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న తమకు జీతాలు పెంచాలని, అలాగే సీఆర్‌టీలుగా మార్పు చేయాలని కోరుతూ పాణ్యంలోని ఎస్టీ చెర్మెన్ కమిషన్ చెర్మన్ డి.వి.జి శంకర్‌రావుకు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా చాలీ చాలని జీతాలతో నెట్టుకోస్తున్నామన్నారు. ప్రభుత్వం త్వరగా స్పందించి జీతాలు పెంచాలన్నారు. రెగ్యులర్ సిబ్బందితో పాటు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది రాత్రింబవళ్లు కుటుంబాలకు దూరంగా ఉండి పని చేస్తున్నారన్నారు. ఈ విషయన్ని ఎస్టీ కమిషన్ తరుపున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. గిరిజన గురుకుల పాఠశాలలో అధిక సంఖ్యలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అధికంగా ఉన్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారి జీవన ప్రమాణాలు పెంచేలా చెర్మన్ కృషి చేయాలన్నారు కార్యక్రమంలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్టీ కమిషన్ చెర్మన్‌తో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

వ్యవసాయ కార్యక్రమాలపై అవగాహన పెంచండి

- ఇన్‌పుట్ డీలర్లకు వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ సూచనలు

కర్నూలు(అగ్రికల్చర్): రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై రైతులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ ఇన్‌పుట్ డీలర్లను కోరారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమ కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయం అభివృద్ధికి చేపట్టిన చర్యలు, అమలు చేస్తున్న కార్యక్రమాలను ఇన్‌పుట్ డీలర్లకు వివరిస్తూ.. వీటిని రైతుల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయ, అనుబంధశాఖలకు చెందిన అన్ని రకాల కార్యక్రమాలను రైతుల ముంగిటకే తీసుకెళ్లిందని తెలిపారు. రైతులు ఆర్‌బీకేలను సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని పేర్కొన్నారు. ఖరీఫ్, రబీల్లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయడం వల్ల కలిగే ఉపయోగాలపై రైతులకు మరింత అవగాహన పెంచాలని పేర్కొన్నారు. ఈ-క్రాప్‌లో పంటలను నమోదు చేయించుకోవడమే కాదు.. వాటిని ధ్రువీకరిస్తూ ఈ-కేవైసీ కూడా చేయించుకోవాలని వివరించారు. వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఆర్‌బీకేల వారీగా కస్టమ్ హయ్యరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమం సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ... పంటల్లోని చీడపీడల నివారణకు అడ్డగోలుగా పురుగుమందులు వాడకుండా రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకే పురుగు మందులు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్

మానవ హక్కుల ఉల్లంఘనపై కఠినంగా వ్యవహరించాలి

కర్నూలు (టౌన్) : సోషల్ మీడియాలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు పోలీసు, న్యాయ వ్యవస్థలు కఠినంగా వ్యవహరించాలని ప్రసూన న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శివాజీరావు, జిల్లా కోర్టు అడ్వకేట్ బి. లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ జి. క్రిష్ణకాంత్, అడిషనల్ ఎస్పీ టి. సర్కార్ ఆధ్వర్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ సూచనల మేరకు ఆదివారం స్థానిక జిల్లా పోలీసు శిక్షణ కార్యాలయంలో పోలీసు, న్యాయ వ్యవస్థలు-మానవ హక్కుల ఉల్లంఘనలపై సోషల్ మీడియాలో దాని ప్రభావం అన్న అంశంపై జిల్లా పోలీసు సిబ్బంది చర్చ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఏ ఒక్కరు కూడా వ్యక్తిగత జీవితాలను ఇబ్బందికి గురి చేయరాదని చెప్పారు. అలా ఎవరైనా ప్రవర్తిస్తే పోలీసు, న్యాయవ్యవస్థలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దిశ డీఎస్పీ సుధాకర్ రెడ్డి, డీటీసీ ఇన్‌స్పెక్టర్ రమేష్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ బాబు కోడుమూరు సర్కిల్ సీఐ మన్సూరుద్దీన్ ఎస్సైలు, డీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.



సోషల్ మీడియా ప్రభావంపై నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

కర్నూలు(సెంట్రల్): మునిసిపల్ ఉద్యోగ, కార్మికుల సరెండర్ లీవులు, ఎన్‌క్యాస్‌మెంట్ విడుదలలో నిర్లక్ష్యం తగదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో జిల్లా మునిసిపల్ వర్కర్స్ యూనియన్ 5వ మహాసభలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రెండున్నరేళ్లుగా మునిసిపల్ కార్మికుల సరెండర్ లీవుల ఎన్‌క్యాస్‌మెంట్ చేయకపోవడం అన్యాయమన్నారు. అనంతరం జిల్లా మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మునెప్ప, పులగంమద్దిలేటిని ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు

సి.బెళగల్: మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామ ప్రాథమికొన్నత (ప్రస్తుతం ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యింది) పాఠశాలలో 1990 నుంచి 1994 మధ్య కాలంలో 7వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఉద్యోగం, వ్యాపారాల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిని పూర్వ విద్యార్థులు ముప్పైఏళ్ల తర్వాత ఒకేవేదికపై చేరారు. ఒకరినొకరు పలుకరించుకుంటూ పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన సరస్వతీ విగ్రహాన్ని ఆ పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు ప్రతిష్ఠించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నాగరత్నం శెట్టి, మద్దయ్య, క్రిష్ణయ్య, రమేష్, వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, షాజహాన్ తదితరులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు చంద్రశేఖర్ యాదవ్, రుక్మాందుడు, రమేష్ నాయుడు, వెంకటరాముడు, చంద్రశేఖర్ నాయుడు, రవికుమార్, నిర్మళ, పరమేష్, రమాదేవి, శైలజ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత

- గొందిపర్లలో రూ.58 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు
- కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. ఆదివారం గొందిపర్ల గ్రామ పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీలో తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.58 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ నేహిమియా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏళ్ల తరబడి రాజకీయాలు చేసిన నాయకులు పల్లెల్లో కనీసం తాగు నీటి అవసరాలు కూడా తీర్చలేకపోయారన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించలేని వారు మాయ మాటలతో ఇన్నేళ్లు ప్రజలను మోసం చేశారన్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. జల్ జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కుళాలు ఏర్పాటు చేసేందుకు చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు గ్రామాల్లో తాగు నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, భరత్‌రెడ్డి, గోపాల్, గౌస్, సుధాకర్, గిడ్డయ్య, నరసింహులు, డా.రాముడు, మల్లికార్జున, తిమ్మప్ప, పాదుపు మద్దిలేటి, సాయి, తదితరులు పాల్గొన్నారు.



ఓవర్‌హెడ్ ట్యాంకు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

గూడూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను విన్నవించి పరిష్కరించుకోవాలని సూచించారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. అధికారులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరు కావాలని, గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

కల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ టీవీ రమేష్ బాబు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీలను సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

నేడు ఈర్లదిన్నెలో వై ఏపీ నీడ్స్ జగన్

సి.బెళగల్: మండల పరిధిలోని ఈర్లదిన్నె గ్రామలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ సచివాలయంలో మధ్యాహ్నం ఒంటి గంటకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతున్నారన్నారు. ప్రజలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ నరసింహులును సన్మానిస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆదివారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నరసింహారావు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి వారికి స్వాగతం పలికి పూజలు నిర్వహింపజేశారు. అలాగే కర్నూలు జిల్లా న్యాయమూర్తి ఎన్. శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీలు రాధారాణి, వి.ఆదినారాయణ, ఏడీజే జి.అర్చన పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో వారికి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు. అలాగే.. సీఐడీ ఎస్పీ నగేష్, కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ ముడియం చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. అనంతరం స్థానిక యాగశాలలో వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు. వారి వెంట హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన సీఐడీ ఎస్పీ నగేష్, కుటుంబ సభ్యులు

హౌసింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డీఈఓలను రెగ్యులర్ చేయాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి. హనుమన్న కోరారు. ఆదివారం అసోసియేషన్ నేతలు హౌసింగ్ డైరెక్టర్ జి. రమాదేవిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా హనుమన్న మాట్లాడుతూ వర్క్‌ఇన్‌స్పెక్టర్లకు ఫీల్డ్‌లో పనిచేసేందుకు ఎఫ్‌టీఏ ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు రూ.16,411మాత్రమే వేతనంగా అందిస్తున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను హౌసింగ్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ, మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ దృష్టికి తీసుకుపోతామని డైరెక్టర్ రమాదేవి హామీ ఇచ్చారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్ దాసు, సుబ్బానాయక్, నాయకులు మంద శ్రీనివాసులు, పుల్లయ్య, ఓబులేసు, రామక్రిష్ణ, శివశంకర్‌రెడ్డి, ఎస్ఎం బాషా, మురళీ తదితరులు ఉన్నారు.

అన్ని మండలాలను కరువుగా ప్రకటించాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో కల్లూరు, ఓర్వకల్ మండలాల జనరల్ బాడీ సమావేశాలు జరిగాయి. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..కర్నూలు రూరల్, తుగ్గలి మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. అంతేకాక కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.తక్షణమే పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు .కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, నాగన్న, శ్రీధర్, చంద్రబాబు, కృష్ణ, లక్ష్మన్న, ధర్మారెడ్డి, గోపీ శీను, మారెన్న, రాజుపాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు

- నది తీర ప్రాంతాల్లో జోరుగా వరికోతలు కోస్తున్న వరికోత యంత్రాలు
- ఆనందంలో రైతన్నలు

నందవరం: ఆరుగాలం శ్రమించిన రైతన్నకు పంట పండింది. మంచి దిగుబడులు పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. నది తీర ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో ఆరంభంలో అధికంగా వర్షాలు కురవడంతో రైతులు వరి సాగుపై మొగ్గు చూపారు. ప్రస్తుతం నది తీర ప్రాంతాల్లో వరి కోతలు ఊపందుకున్నాయి. యంత్రాల సవ్వడి.. కూలీల సందడితో నది తీర ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. మండలంలో 2,244 ఎకరాల్లో వరి సాగైందని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు. రైతులు బీపీటీ 5204, ఎన్‌డీఎల్ఆర్, ఆర్ఎన్ఆర్ వరి రకాలు ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం మండలంలోని నది తీర ప్రాంతాలైన నదికై రవాడి, నాగలదిన్నె, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, గురజాల గ్రామాలలో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. కూలీల భారంతో రైతులు యంత్రాల ద్వారా వరి కోతలను ప్రారంభించారు. ప్రభుత్వం వరికి మద్దతు ధర రూ.2,200తో పాటు బయట మర్కెట్లో వరి ధాన్యానికి రూ.2,500 నుంచి రూ.3,000 వరకు ధర పలుకుతోంది. వరికి గిట్టుబాటు ధర లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి కోతలు పూర్తయిన రైతులు ధాన్యాలను కల్లాల్లో ఆరబోసుకుని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో పాటుగా గడ్డికి కూడా డిమాండ్ పెరగడంతో ఎకరం వరి గడ్డి రూ.10 వేలు పలుకుతోంది. ఈ సారి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని, వరి ధాన్యానికి మంచి ధర లభిస్తుడదంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పెద్దకొత్తిలిలో యంత్రంతో వరి కోతలు చేపడుతున్న దృశ్యం

తక్కువ ధరకు అమ్ముకోవద్దు



వరి ధాన్యానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. రైతులు తొందరపడి తక్కువ ధరకు అమ్ముకోవద్దు. ప్రభుత్వం కూడా వరికి గిట్టుబాటు ధరను కల్పించింది. మార్కెట్లో వరికి రూ.2,500 నుంచి రూ. 3 వేల వరకు ధర లభిస్తుంది. ధాన్యానికి డిమాండ్ పెరగడంతో ధరలు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యానికి రూ.2,203 గిట్టుబాటు ధర కల్పించింది.

– ఏఓ మర్రి స్రవంతి, నందవరం